తెలంగాణ పథకాలు మహారాష్ట్రలోనూ కావాలి

- నాగపూర్ బీఆర్ఎస్ సమన్వయ కర్త చరణ్‌వాగ్

ముంబై(నమస్తే తెలంగాణ): తెలంగాణలో అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను మహారాష్ట్రలో అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాగపూర్ విభాగ సమన్వయకర్త చరణ్‌వాగ్ డిమాండ్ చేశారు. భండరా జిల్లా తుమసర్ పట్టణంలో సోమవారం వేలాది మంది రైతులు, గిరిజనులు, వ్యవసాయ కూలీలతో కలిసి రెవెన్యూ డివిజన్ అధికారి తేలేకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చరణ్‌వాగ్ మాట్లాడుతూ.. మహారాష్ట్రలోని రైతులకు తెలంగాణలో అమలు చేస్తున్న విధంగా ఎకరాకు రూ.10వేలు, 24 గంటల ఉచిత విద్యుత్తు, రూ.5 లక్షల రైతు బీమా, గిరిజన బంధు, దళిత బంధు పథకం, చేనేత కార్మికులకు, బీడీ కార్మికులకు రూ.2 వేల పింఛను అమలు చేయాలని కోరారు.

బీజేపీ అభ్యర్థికి కాంగ్రెస్ నేత ప్రచారం

రాజస్థాన్‌లో కాంగ్రెస్-బీజేపీ దోస్తీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): కేంద్రంలోని బీజేపీకి బీఆర్ఎస్ బీ-టీమ్ అంటూ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేస్తూ గగ్గోలు పెడతారు. కానీ రాజస్థాన్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీ గెలుపునకు ప్రచారం చేస్తున్నారు. తెలంగాణలో జరిగిన మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్‌ను గెలిపించడానికి ఆయన సోదరుడు, కాంగ్రెస్‌లో ఉన్న సీనియర్ నాయకుడు కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి ప్రయత్నించారు. ఇందుకు సంబంధించిన ఆడియో కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. కాంగ్రెస్-బీజేపీ మధ్య దోస్తీ ఉందని చెప్పడానికి ఈ రెండు ఉదాహరణలు చాలు. ఇటీవలే రాజస్థాన్ వీర్‌తేజా బోర్డు చైర్మన్‌గా సహాయ మంత్రి హోదా పదవి పొందిన ప్రముఖ జాట్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రిక్షపాల్ సింగ్ మిర్దా తన మేనకోడలు, బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఎంపీ జ్యోతి మిర్దా గెలుపుకోసం పనిచేస్తానంటూ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రిక్షపాల్ సింగ్‌కు ఆ ప్రాంతంలో పలుకుబడి ఉంది. అతని కుమారుడు విజయపాల్ మిర్ధా కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేనే. ఆదివారం తన కార్యాలయంలో రిక్షపాల్ సింగ్ మాట్లాడుతూ 'బీజేపీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న జ్యోతి మిర్దా గెలుపు కోసం పనిచేస్తా' అని బహిరంగంగా ప్రకటించారు.

నిన్న ఆప్.. నేడు ఎస్పీ

- మధ్యప్రదేశ్‌లో ఒంటరిగానే పోటీ: సమాజ్‌వాదీ
- ఇండియా కూటమిలో ఎన్నికల చిచ్చు

లక్నో: ఇండియా కూటమిలో కాంగ్రెస్, ఆప్ మధ్య ఎన్నికల పంచాయితీ తెగకముందే మరో కొత్త పంచాయితీ తెరపైకి వచ్చింది. తాజాగా మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ మధ్య సీట్ల లొల్లి మొదలైంది. దాదాపు 5 స్థానాల్లో ఇరు పార్టీల అభ్యర్థులు పోటీ చేయనున్నారు. ఎస్పీ నేత ఒకరైతే తాము ఒంటరిగానే బరిలోకి దిగుతామని ప్రకటించారు. ఇటీవల ఆప్ నేతలు కూడా హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తాననడం.. దీనికి కాంగ్రెస్ దీటుగానే బదులివ్వడం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల నాటికి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

బెంగళూరులో ఓవైపు కొవ్వొత్తుల వెలుతురులో, మరోవైపు సెల్‌ఫోన్ వెలుగులో పనులు చేసుకుంటున్న ఓ కుటుంబం

కరెంట్ కోతలను నిరసిస్తూ మండ్య జిల్లాలో ఆందోళన చేస్తున్న రైతులు

కన్నడనాట కటిక చీకట్లు

పవర్ కట్స్‌తో రాష్ట్రమంతటా అంధకారం

- రాష్ట్రంలో 2 వేల మెగావాట్ల లోటువిద్యుత్తు
- బెంగళూరులో 4-5 గంటలపాటు కోతలు
- డీజిల్ జనరేటర్లు తెచ్చుకొంటున్న పౌరులు
- షిఫ్టులు మార్చుకొంటున్న ఐటీ కంపెనీలు
- పవర్ హాలిడేలు ప్రకటిస్తున్న పరిశ్రమలు
- ఎండినపంట చూడలేక రోడ్లమీదకు రైతన్నలు
- సిద్ధరామయ్య సర్కారుపై విపక్ష పార్టీల ఫైర్

మండ్యలో సెల్‌ఫోన్ వెలుతురులో ఓ అధికారి విధులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌పాలనలో కన్నడనాట కటిక చీకట్లు అలుముకొన్నాయి. రాష్ట్ర రాజధాని బెంగళూరులోనే రోజుకు నాలుగైదు గంటల పాటు విద్యుత్తు కోతలు విధిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే అనధికార కోతలు ఆరేడు గంటలపాటు విధిస్తున్నట్టు సమాచారం. అక్టోబర్‌లో ఉష్ణోగ్రతలు పెరుగడంతో విద్యుత్తు డిమాండ్ 15,000 మెగావాట్లకు చేరుకోగా, ఆ స్థాయిలో సరఫరా జరుగట్లేదని అధికారులు చెబుతున్నారు. 1,500 మెగావాట్ల నుంచి 2,000 మెగావాట్ల వరకూ లోటువిద్యుత్తు ఉన్నట్టు పేర్కొంటున్నారు. కర్ణాటక చరిత్రలోనే ఈ స్థాయి లోటువిద్యుత్తు గతంలో ఎన్నడూ రికార్డుకాలేదు. విద్యుత్తు కోతలపై సామాన్యులతోపాటు పారిశ్రామిక వర్గాలు సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పండుగ సమయాల్లో విద్యుత్తు కోతలు కొనసాగుతుండటంతో అపార్ట్‌మెంట్ వాసులు డీజిల్ జనరేటర్లను కొనుక్కోవడం, కిరాయికి తెచ్చుకోవడం వంటివి చేస్తున్నారు. కరెంట్ కోతలకు అనుగుణంగా ఐటీ కంపెనీలు షిఫ్టుల్లో మార్పుచేర్పులు చేస్తున్నాయి. బెంగళూరు శివారుల్లోని పలు పరిశ్రమలు ఇప్పటికే వారానికి రెండు రోజులు పవర్ హాలీడేలు ప్రకటించాయి. కొన్ని కంపెనీలు ఒక షిఫ్టును రద్దు చేశాయి. విద్యుత్తు కోతలతో సాగునీటికి కటకట ఏర్పడి వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో వందలాది మంది రైతులు రోడ్లమీదకు వచ్చి సర్కారుకు వ్యతిరేకంగా ధర్నాలు చేస్తున్నారు. పక్కనే ఉన్న తెలంగాణలో నాణ్యమైన కరెంటును నిరంతరాయంగా సరఫరా చేస్తుంటే.. తమ రాష్ట్రంలో కనీసం నాలుగు గంటలైనా నిరంతరాయంగా కరెంటు సరఫరా కావట్లేదని కర్ణాటక వాసులు వాపోతున్నారు. అధికారమిచ్చిన ఐదు నెలలకే కర్ణాటకను చీకటిపాలు చేసిన కాంగ్రెస్‌కు తెలంగాణలో పొరపాటున ఓటేస్తే పరిస్థితి ఏమిటని తెలంగాణబుద్ధిజీవులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఓటరన్నా..

అధికారమిచ్చిన ఐదు నెలలకే కర్ణాటకలో చీకట్లు నింపిన కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణలో మన పరిస్థితి ఏంటి??

పవర్ కట్స్‌కు భయపడి వర్క్‌ఫ్రమ్‌హోమ్

'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్నట్టుగా..'.. ప్రతి పేదవాడికి 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా ఇస్తామని కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అసలు విద్యుత్తు సరఫరాను సక్రమంగా చేయట్లేదు. సిలికాన్ సిటీగా పేరుగాంచిన బెంగళూర్‌లోనే నాలుగు, ఐదు గంటల పాటు విద్యుత్తు కోతలు విధిస్తున్నారు. దీంతో కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు కొన్ని ఐటీ కంపెనీలు షిఫ్టులను మారిస్తే, మరికొన్ని కంపెనీలు సాయంత్రం 4 గంటలలోపు పనులను పూర్తిచేసుకోవాల్సిందిగా ఉద్యోగులకు సూచిస్తున్నాయి. విద్యుత్తు కోతలకు భయపడి మరికొన్ని కంపెనీలు వర్క్‌ఫ్రమ్‌హోమ్ వ్యవధిని పొడిగించినట్టు సమాచారం. మరోవైపు, కరెంటు కోతలతో పారిశ్రామిక ఉత్పత్తి పడిపోతున్నదని, పవర్ హాలిడేలు ఇచ్చే దుస్థితి దాపురించిందని పారిశ్రామికవర్గాలు మండిపడుతున్నాయి. ప్రభుత్వ ఉదాసీనతపై ధ్వజమెత్తుతున్నాయి. ఇక గ్రామీణ ప్రాంతాలలో అయితే కచ్చితంగా ఎన్ని గంటలు కోత ఉంటుందో చెప్పలేని దుస్థితి. ఉత్తర కర్ణాటకలో అయితే విద్యుత్ కోతల సమస్య అంతా, ఇంతా కాదు. రాష్ట్రంలో ఎడాపెడా విద్యుత్తు కోతలను నిరసిస్తూ కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ పిలుపు మేరకు వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక వర్గాలు ఇప్పటికే పలుమార్లు బంద్ పాటించాయి.

పండుగ సీజన్‌లో కష్టాలు

బెంగళూరుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడెక్కడ విద్యుత్తు కోతలు విధించేది బెంగళూర్ ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ లిమిటెడ్ (బీఈఎస్సీవోఎం)తో పాటు కర్ణాటక పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (కేపీటీసీఎల్) ప్రకటిస్తున్నది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కొన్ని చోట్ల, సాయంత్రం 5 గంటల వరకు మరికొన్ని చోట్ల విద్యుత్తు కోతలు ఉంటాయని ప్రతీవారం ప్రత్యేక షెడ్యూల్‌గా విడుదల చేస్తున్నది. ఉత్తర కర్ణాటకతో పాటు మంగళూరు, ఉడుపి, శివమొగ్గ తదితర జిల్లాల్లో విద్యుత్తు కోతలు ఎక్కువగా ఉన్నట్టు సమాచారం. జలవిద్యుదుత్పత్తి నెమ్మదించడం, కేపీటీసీఎల్ పరిధిలోని 13 థర్మల్ యూనిట్లలో ఏడు స్టేషన్లలో మాత్రమే కార్యకలాపాలు కొనసాగుతుండటం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, పండుగల సీజన్, బొగ్గు కొరత, ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడమే రాష్ట్రంలో విద్యుత్తు కోతలకు కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

భస్మాసుర హస్తం

ఎండుతున్న పంటలు

వ్యవసాయానికి సరిపడా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఆ హామీని నిలబెట్టుకోవడంలో ఘోరంగా విఫలమైంది. గంటలకొద్దీ ఎడాపెడా విద్యుత్తు కోతలతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఫలితంగా వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఇది తట్టుకోలేని రైతులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. కర్ణాటకలోని గుల్బర్గా, బళ్లారి తదితర ప్రాంతాల్లోని 216 తాలూకాల్లోని వేలాది మంది రైతులు వ్యవసాయ పంపుసెట్లపై ఆధారడుతూ పంటలసాగు చేస్తున్నారు. కోతలు లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కురుగోడు తాలూకా సింధిగేరి, బైలూరు, కగ్గల్, కల్లుకంభ, ముష్టగట్టి, కోళూరు బాదనహట్టి, వద్దట్టి తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు స్థానిక కురుగోడులోని గుల్బర్గా ఎల్క్ట్రిసిటీ సప్లై కంపెనీ లిమిటెడ్ (జెస్కాం) శాఖ కార్యాలయం ముందు ఇటీవల నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

- మహారాష్ట్రలో కూలిన నిర్మాణంలోని ఫ్లైఓవర్



మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో ముంబై-గోవా హైవేపై నిర్మాణంలో ఉన్న ఓ ఫ్లైఓవర్ కూలిపోయింది. దీని కిందనున్న ఓ క్రేన్ తీవ్రంగా దెబ్బతింది. అదృష్టవశాత్తూ ఎవరూ గాయపడలేదు. పెద్ద ఎత్తున దుమ్ము, ధూళి ఎగసిపడటంతో ఆ మార్గంలో వెళ్తున్నవారంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యత గురించి అధికారులు, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌పై విరుచుకుపడ్డారు.

కమర్షియల్ పైలట్ లైసెన్స్ చెల్లుబాటు పదేండ్లు

న్యూఢిల్లీ: కమర్షియల్ పైలట్ హోల్డర్లకు కేంద్రం శుభవార్త చెప్పింది. కమర్షియల్ పైలట్ లైసెన్స్ చెల్లుబాటును 10 ఏండ్లకు పెంచుతూ పౌర విమానయాన శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్-1937కు సవరణలు చేసింది. ఏవియేషన్ సెక్టార్‌లో సులభతర వాణిజ్యాన్ని మెరుగుపరిచేందుకు సవరణలు చేసినట్టు కేంద్రం తెలిపింది. ప్రస్తుతం ఐదేండ్ల కాల పరిమితి మాత్రమే ఉన్న ఎయిర్‌లైన్ ట్రాన్స్‌పోర్ట్ పైలట్ లైసెన్స్, కమర్షియల్ పైలట్ లైసెన్స్ తాజా సవరణలతో పదేండ్ల పాటు చెల్లుబాటు కానున్నాయి. ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోలర్ లైసెన్స్‌లలోనూ మార్పులు చేశారు.

జేడీఎస్‌లో బీజేపీ కుంపటి!

- చీలిక దిశగా జనతా దళ్ (సెక్యులర్)
- బీజేపీతో పొత్తును వ్యతిరేకిస్తున్న పార్టీ కర్ణాటక అధ్యక్షుడు ఇబ్రహీం
- తమదే అసలైన జేడీఎస్ అని వ్యాఖ్య
- రాష్ట్రంలో పార్టీ విధానాలపై నిర్ణయాధికారం నాదే
- బీజేపీతో మీరు వెళ్లండి.. మేం రాం
- పొత్తుపై పునరాలోచన చేయాలని పార్టీ సుప్రీం దేవెగౌడకు సూచన

ఇబ్రహీం

దేవెగౌడ

బెంగళూరు, అక్టోబర్ 16: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని జనతా దళ్ సెక్యులర్(జేడీఎస్) అధినేత హెచ్‌డీ దేవెగౌడ తీసుకొన్న నిర్ణయం ఆ పార్టీలో సంక్షోభం సృష్టించే అవకాశం కనిపిస్తున్నది. ఆ పార్టీ రెండుగా చీలిపోయే ప్రమాదం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో జేడీఎస్ చేరికను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కర్ణాటక రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సీఎం ఇబ్రహీం ఆ మేరకు సంకేతాలు ఇచ్చారు. కొంత మంది పార్టీ నేతలతో ఆయన సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీజేపీతో కలిసి వెళ్లొద్దని పార్టీ సుప్రీం దేవెగౌడను కోరారు. సెక్యులర్‌గా ఉన్న తన వర్గమే అసలైన జేడీఎస్ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. జేడీఎస్ కర్ణాటక అధ్యక్షుడిగా రాష్ట్రంలో పార్టీకి సంబంధించి ఏ నిర్ణయం తీసుకోవాలన్నా.. తనకే అధికారం ఉంటుందని అన్నారు. 'వారు(దేవెగౌడ, కుమారస్వామి) బీజేపీతో వెళ్లాలనుకొంటే వెళ్లొచ్చు. తాము మాత్రం ఆ పని చేయలేం' అని వ్యాఖ్యానించిడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. బీజేపీతో వెళ్లకూడదని తాము ఇప్పటికే నిర్ణయం తీసుకొన్నామన్నారు. తనతో చాలా మంది జేడీఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని పేర్కొన్న ఇబ్రహీం.. వారి పేర్లు చెప్పేందుకు మాత్రం తిరస్కరించారు. ప్రతి ఒక్క ఎమ్మెల్యేతో సమావేశం అవుతానని, భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తానని చెప్పారు.

పార్టీని వీడుతున్న నేతలు

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేతో కలిసి వెళ్లకూడదని సమావేశంలో నిర్ణయం తీసుకొన్నామని, అదేవిధంగా కూటమిని ఆమోదించవద్దని దేవెగౌడను కోరుతామని ఇబ్రహీం పేర్కొన్నారు. బీజేపీతో పొత్తు ప్రకటన వల్ల కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో నేతలు పార్టీని వీడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక కోర్ కమిటీ ఏర్పాటు చేస్తామని, సమావేశంలో తీసుకొన్న నిర్ణయాలను ఆ కమిటీ దేవెగౌడకు వివరిస్తుందని తెలిపారు.

నిర్ణయం కోసం వేచి ఉంటాం: కుమారస్వామి

ఇబ్రహీం ప్రకటనపై కుమారస్వామి స్పందించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చాలా స్వతంత్రుడు అని, అతని నిర్ణయం కోసం తాము వేచి ఉంటామని అన్నారు. 'పార్టీ నేతలు, కార్యకర్తలు తీసుకొన్న నిర్ణయం ఒకటుంటుంది. ఆ నేపథ్యంలో అతను(ఇబ్రహీం) ఏర్పాటు చేసిన సమావేశంలో దానిపై తన మద్దతుదారులతో చర్చించారు. అతను తన నిర్ణయం తీసుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ఉన్నది' అని కుమారస్వామి వ్యాఖ్యానించారు.

అవి కాంగ్రెస్ కట్టలే

I తరువాయి...

సమీకరించినవేనని మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప ఆరోపించగా, మరో మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి మరో అడుగు ముందుకేసి ఆ డబ్బు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సమీకరించినవేనని ఆరోపించడం గమనార్హం. కేంద్ర మంత్రితోపాటు, ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు చేసిన ఆరోపణలు కర్ణాటక రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కాగా ఈ ఆరోపణలను డీకే శివకుమార్ ఖండించారు. ఐటీ దాడులు రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. అయితే 'రాజకీయ ప్రేరేపితమని డీకే శివకుమార్ బుకాయించడం కాదు...పట్టుబడిన డబ్బులు మీవో? కావో? చెప్పాలి' అని కుమారస్వామి డిమాండ్ చేసారు.

రేవంత్‌రెడ్డి బుకాయింపు

కర్ణాటకలో పెద్ద మొత్తంలో ఐటీ దాడుల్లో పట్టుబడిన డబ్బు ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు తరలించడానికి సంబంధించినవేనని కేంద్ర మంత్రితో సహా ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు ఆరోపిస్తుండగా, తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 'అక్కడెక్కడో డబ్బులు పట్టుబడితే తమకేమి సంబంధం' అని బుకాయించడం పట్ల ఇక్కడ విపక్ష నేతలు విస్తుపోతున్నారు. తెలంగాణ ఎన్నికలతో డీకే శివకుమార్‌కు సంబంధం లేకుంటే అక్కడి నుంచి టిక్కెట్లు ఆశించే నాయకులు, తన పార్టీ విలీనం కోసం వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డీకేతో ఎందుకు భేటీ అయ్యారని వారు ప్రశ్నిస్తున్నారు. కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ ఎమ్మెల్యేలను హైదరాబాద్‌కు ఎందుకు తరలించినట్టు అని ప్రశ్నిస్తున్నారు. పైగా తెలంగాణలో అభ్యర్థుల ప్రకటన పూర్తయ్యాక తన మకాం హైదరాబాద్‌లోనే అని ఆయన స్వయంగా పార్టీ నేతలకు చెప్పింది వాస్తవం కాదా? అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇలా ఉండగా కర్ణాటక ప్రభుత్వ కాంట్రాక్టర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబికాపతి ఇంట్లో రూ.42 కోట్లు, కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ కాంతరాజ్‌కు సన్నిహితుడైన బిల్డర్ సంతోష్ ఇంట్లో రూ.45 కోట్లు పట్టుబడిన విషయం తెలిసిందే. కాగా వీరంతా డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు అత్యంత సన్నిహితులని కేంద్ర మంత్రి, మాజీ సీఎంలు ఆరోపిస్తుండగా, రేవంత్‌రెడ్డి మాత్రం తమకేమి సంబంధం అని బుకాయించడం పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వసూలు చేసే బాధ్యత అధికారులదే

కర్ణాటకలో గత బీజేపీ సర్కార్ 40 శాతం కమీషన్ వసూలు చేస్తున్నదని పెద్ద యెత్తున ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో తమ పరిస్థితి పెనంపై నుంచి పొయ్యిలో పడినట్టు అయిందని కాంట్రాక్టర్లు, అధికారులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. బెంగళూరు నగరపాలికలో పెండింగ్‌లో ఉన్న సుమారు రెండు వేల కోట్ల రూపాయాల బిల్లులను క్లియర్ చేయడానికి సంబంధిత మంత్రి అయిన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తున్నారని కర్ణాటక కాంట్రాక్టర్ల సంఘం ఏకంగా రాష్ట్ర గవర్నర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అలాగే వ్యవసాయ శాఖ మంత్రి తమకు నెలనెలా కప్పం చెల్లించాలని వేధిస్తున్నారని వ్యవసాయశాఖ అధికారులు కూడా ఫిర్యాదు చేయడం, ఈ వ్యవహారంపై గవర్నర్ విచారణకు ఆదేశించడం తెలిసిందే. అధికారులకు, కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు టార్గెట్ పెట్టి పెద్ద మొత్తంలో కర్ణాటక ప్రభుత్వం సమీకరించిన నిధులు కాంగ్రెస్ పార్టీకి ఖజానాగా మారాయని ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

శివకుమార్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

'శివకుమార్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' పేరుతో కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ తమ శాఖను తెరిచిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవై విజయేంద్ర తీవ్ర ఆరోపణ చేసారు. కర్ణాటకలో శివకుమార్ డబ్బులు వసూలు చేసి ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు పంపుతున్నారని ఆయన ఆరోపించారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు డబ్బులు పంపించే కాంగ్రెస్ ప్లాన్ బెంగళూరులో పట్టుబడిన డబ్బులతో బట్టబయలు అయిందన్నారు. సుపరిపాలన హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు పగటి దోపిడిలో మునిగిపోయిందని విజయేంద్ర ధ్వజమెత్తారు.

ఒక్క కర్ణాటకలోనే రూ.90 కోట్లు

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మూడు రాష్ట్రాల్లో మూడు రోజులుగా కాంట్రాక్టర్లు, బిల్డర్ల నివాసాలు, కార్యాలయాలపై ఐటీ దాడుల్లో గుట్టలు గుట్టలుగా నోట్ల కట్టలు పట్టుబడిన విషయం తెలిసిందే. తమ దాడుల్లో మొత్తంగా రూ.102 కోట్లు పట్టుబడితే అందులో రూ.94 కోట్ల నగదు, రూ.8 కోట్ల ఆభరణాలు ఉన్నాయని ఐటీ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. కాగా పట్టుబడిన నగదులో ఒక్క బెంగళూరులోనే రూ.87 కోట్లు పట్టుబడటం గమనార్హం. దీంతో ఈ కోట్లాది రూపాయాల నిధుల సమీకరణలో కర్ణాటక సర్కార్‌లోని పెద్దతలల పాత్రపై అనుమానాలు మరింత బలపడుతున్నాయి.

ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి ఎలక్టోరల్ బాండ్ల పిటిషన్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 16: రాజకీయ పార్టీలకు విరాళాలకు ఉద్దేశించిన ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సిఫారసు చేసింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. నిశ్చయాత్మక తీర్పు కోసం ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి పంపాలని కోరుతూ వచ్చిన దరఖాస్తుపై ఈ నిర్ణయం తీసుకొన్నట్టు వెల్లడించింది. తదుపరి విచారణను అక్టోబర్ 30కు వాయిదా వేసింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లోగానే ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌పై న్యాయ నిర్ణయం జరుగాల్సిన అవసరం ఉన్నదని అంతకుమందు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనను ధర్మాసనం పరిగణనలోకి తీసుకొన్నది.

గుండెచప్పుడును ఆపలేం

- 26 వారాల గర్భ విచ్ఛిత్తికి నో
- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- కొద్ది రోజులుగా మలుపులు తిరుగుతూ వచ్చిన కేసు

న్యూఢిల్లీ: గతకొద్ది రోజులుగా మలుపుతూ తిరుగుతున్న గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. తన 26 వారాల గర్భాన్ని తొలగించుకొనేందుకు పిటిషన్‌దారురాలైన ఓ 27 ఏండ్ల వివాహితకు న్యాయస్థానం అనుమతి నిరాకరించింది. గర్భంలోని పిండం ఆరోగ్యవంతంగా ఉన్నదని, ఎటువంటి సమస్య లేదని ఎయిమ్స్ మెడికల్ బోర్డు నివేదిక సమర్పించిన నేపథ్యంలో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. గర్భం వయసు మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ(ఎంటీపీ) గరిష్ఠ పరిమితి అయిన 24 వారాలు దాటిందని, ఆ తర్వాత గర్భవిచ్ఛిత్తికి అనుమతి ఉండదని స్పష్టం చేసింది. పిండం వయసు 26 వారాల 5 రోజులుగా ఉన్నదని, పిండంలో అసాధారణ పరిస్థితులు ఏమీ లేవని, తల్లి ఆరోగ్యానికి తక్షణ ముప్పు లేదని పేర్కొన్నది. గుండె చప్పుడు ఆపలేమని స్పష్టంచేసింది.

ముందు అనుమతి.. తర్వాత తిరస్కరణ

తనకు ఇప్పటికే ఇద్దరు పిల్లలు ఉన్నారని, రెండో ప్రసవం అనంతరం తాను సైకోసిస్ సమస్యతో బాధపడుతున్నానని, మూడో గర్భాన్ని తొలగించుకొనేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఓ మహిళ పిటిషన్ వేశారు. ఎయిమ్స్ వైద్యుల నివేదిక మేరకు మొదట న్యాయస్థానం గర్భవిచ్ఛిత్తికి ఈనెల 9న అనుమతి ఇచ్చింది. అయితే అనంతరం పిండం బతికేందుకు అవకాశం ఉందని పేర్కొంటూ సదరు మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించిన ఎయిమ్స్ బృందంలోని వైద్యుడొకరు ఈనెల 10న కోర్టుకు ఈమెయిల్ పంపారు. ఈ నేపథ్యంలో తీర్పును పునఃపరిశీలించాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది. గత బుధవారం జరిగిన విచారణలో భిన్న తీర్పులు వచ్చాయి. ఆ తర్వాత ఈ కేసు సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు వచ్చింది.

స్వలింగ పెండ్లిండ్ల చెల్లుబాటుపై నేడు సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ: స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు మంగళవారం తీర్పు చెప్పబోతున్నది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రా